ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
సెప్టెంబరు 4, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




"సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణలు చేపట్టాం. సామాన్యులు రోజువారీ వినియోగించే అధిక శాతం వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది
- మంత్రి నిర్మలా సీతారామన్

## రెండు శ్లాబుల విధానానికి ఏకగ్రీవ ఆమోదం

- ఈ నెల 22 నుంచి అమల్లోకి
- జీఎస్‌టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు
- ఇక బ్రెడ్డు, బన్ను, చపాతీ, పరోటా చౌక
- గణనీయంగా తగ్గనున్న వాహన ధరలు
- ఎలక్ట్రిక్ వాహనాలపై 5శాతం పన్ను..
- టూత్‌పేస్ట్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్‌పై 5%
- సిగరెట్లు, గుట్కాలు, కూల్‌డ్రింక్స్ విలాస వస్తువులపై 40%

న్యూఢిల్లీ: సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం దించుతూ జీఎస్‌టీ మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవంనాడు ప్రధాని ప్రకటించిన దీపావళి కానుక దసరాకు ముందే వచ్చింది. చపాతీ, పరోటా, బ్రెడ్డు, బన్నులపై జీఎస్‌టీని పూర్తిగా తొలగించాలని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అధ్యక్షతన భేటీ అయిన జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయించింది. అంతేకాదు కుటుంబాలకు ఆధారమైన ఆరోగ్య, జీవిత బీమాపై ప్రస్తుతమున్న 18 శాతం జీఎస్‌టీని ఎత్తివేయనుంది. దీంతో ఆ మేరకు వాటి ప్రీమియంలు తగ్గనున్నాయి. ఇకపై జీఎస్‌టీలో 5, 18 శాతం పన్ను శ్లాబులే ఉంటాయి. 12 శాతం, 28 శాతం శ్లాబుల్లోని వస్తువులు 5, 18 శాతం శ్లాబుల్లోకి మారనున్నాయి. బంగారం, వెండి, వజ్రాభరణాలపై ప్రత్యేక పన్ను రేటు 3 శాతం ఇక ముందూ కొనసాగనుంది. సెప్టెంబర్ 22 నుంచే (దేవీ నవరాత్రి వేడుకలు మొదలయ్యే రోజు) కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రతిపాదనలకు

(మిగతా 2వ పేజీలో)

## హరీశ్, సంతోష్ మేక వన్నె పులులు..

### మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత

- మా కుటుంబం, తెలంగాణ మంచి కోరుకునే వాళ్లు కాదు
- వాళ్లను పక్కన పెడితేనే పార్టీ బతికి బట్ట కడుతుంది
- నన్ను పార్టీ నుంచి బయటకు పంపి బలి చేశారు..ఇది ఇంతటితో ఆగదు
- నాన్న కేసీఆర్‌కు, రామన్నకు కూడా ఇలాంటి ప్రమాదమే పొంచి ఉంది
- మా కుటుంబం విచ్ఛిన్నమైతే వారికి అధికారం వస్తుంది కాబట్టే కుట్ర
- హరీశ్ వల్లే ఈటల, జగ్గారెడ్డి తదితరులు పార్టీ వదిలి వెళ్లారు
- కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని కోరుకుంటున్నానన్న కవిత
- నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి అంటూ హితవు
- ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి



హైదరాబాద్: 'బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీశ్‌రావు, సంతోష్‌రావు కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగా నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు..' అని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 'నాన్నా.. దయచేసి మీ చుట్టూ ఏం జరుగుతోందో చూసుకోండి. నేను కూడా మీలా ముక్కుసూటి మనిషిని కాబట్టి నన్ను పార్టీ నుంచి బయటకు పంపి బలి చేశారు. రేపు మీకూ, రామన్నకు కూడా ఇలాంటి ప్రమాదమే పొంచి ఉంది..' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. పార్టీ ద్వారా తనకు లభించిన ఎమ్మెల్సీ పదవితో పాటు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌పై సంచలనాత్మక ఆరోపణలు చేశారు. ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

**మా కుటుంబం బాగుండటం వారికిష్టం లేదు..**

కేసీఆర్, కేటీఆర్‌తో నాది కుటుంబ, రక్త సంబంధం. పదవులు, పార్టీతో ముడిపడిన బంధం కాదు. కానీ పార్టీలో ఉంటూ డబ్బులు సంపాదించుకుని వ్యక్తిగత లబ్ధి పొందాలని భావించే వ్యక్తులకు మేము బాగుండటం ఇష్టం లేదు. మా కుటుంబం విచ్ఛిన్నమైతేనే వారికి అధికారం వస్తుంది కాబట్టి నన్ను బయటకు నెట్టారు. ఇది ఇంతటితో ఆగదు అని దైవ సమానులు కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా.

**వారిళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?**

నాకు జన్మనిచ్చి, ప్రాణభిక్ష పెట్టిన నా తండ్రి చిటికెన వేలు పట్టుకుని తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిన నేను సామాజిక తెలంగాణ కోరుకోవడం కొందరికి నచ్చలేదు. హరీశ్‌రావు, సంతోష్ నాపై పనికట్టుకుని సామాజిక తెలంగాణ పేరిట పార్టీ పెడుతున్నట్లు ప్రచారం చేశారు. హరీశ్, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా? నేను అక్రమ కేసుల్లో తీహార్ జైలులో ఐదు నెలల పాటు గడిపి బయటకు వచ్చిన తర్వాత 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అనుమతితో గులాబీ కండువా కప్పుకుని అనేక ప్రజా సమస్యలు, అంశాలపై పోరాటం చేశా.

**వారిని ఎందుకు క్షమిస్తున్నారన్నదే నా ఆవేదన**

నా మీద జరుగుతున్న కుట్రల విషయంలో

(మిగతా 2వ పేజీలో)



## కలిసికట్టుగా సాగుదాం

- మనస్పర్థలు పక్కనబెట్టి పనిచేద్దాం
- కాంగ్రెస్ మోసాలు, బీజేపీ ముప్పును ప్రజలకు వివరించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- బీఆర్ఎస్‌లోకి మణుగూరు కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్: పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్నచిన్న మనస్పర్థలు పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటేందుకు కృషి చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారానే రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలు, బీజేపీతో రాష్ట్రానికి పొంచి ఉన్న ముప్పును ప్రజలకు వివరించాలని సూచించారు. ఎర్రవల్లి నివాసంలో బుధవారం పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన

(మిగతా 2వ పేజీలో)

## బుద్ధి ఉన్నోడెవరైనా వారి వెనకాల ఉంటారా?

- నేను నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల వెంటే ఉంటా
- మీ కుల, కుటుంబాల వివాదంలోకి మమ్మల్ని లాగొద్దు
- వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకుంటున్నారు
- బిఆర్ఎస్‌లో 'పంచాయితీ'లపై సిఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు
- పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తాం.. పాలమూరులో సిఎం రేవంత్







## దశాబ్దాల కృషిని ట్రంప్ నాశనం చేశారు


వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై భారతీయ అమెరికన్, కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా విమర్శలు గుప్పించారు. భారత్‌పై భారీ సుంకాలు విధించి దశాబ్దాలుగా ఇరుదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నాశనం చేశారని ఆగ్రహంవ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు చేసిన కృషి ఒక్క సుంకాల వల్ల తుడిచి పెట్టుకుపోయిందన్నారు. అరుదైన అత్యవసర పరిస్థితి అంటూ హెచ్చరించారు

## విద్యార్థులతో టీచర్లూ భోజనం!

ఫుడ్ పాయిజన్ సమస్యకు ఇదే పరిష్కారం: హైకోర్టు



## 6న గణేశ్ నిమజ్జనానికి అమిత్‌షా



# రెండు శ్లాబుల విధానానికి ఏకగ్రీవ ఆమోదం



అన్ని రాష్ట్రాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. "సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని ఈ సంస్కరణలు చేపట్టాం. సామాన్యులు రోజువారీ వినియోగించే అధిక శాతం వస్తువులపై పన్ను రేట్లు గణనీయంగా తగ్గనున్నాయి. కార్మికుల ఆధారిత రంగాలకు చక్కని మద్దతు లభిస్తుంది. రైతులు, వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం ప్రయోజనం పొందుతాయి. ఆర్థిక వ్యవస్థలోని కీలక చోదకాలకు ప్రాధాన్యం ఇచ్చాం"అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యాపార నిర్వహణ సైతం సులభతరం అవుతుందని, నిబంధనల అమలు సరళంగా మారుతుందన్నారు. తాజా పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణతో రూ.48,000 కోట్ల ఆదాయం తగ్గిపోనుందని, ద్రవ్యపరంగా దీన్ని ఎదుర్కోగలమని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ నిర్ణయాలతో దేశీ వినియోగం మరింత పెరుగుతుందన్నది కేంద్ర ప్రభుత్వం అంచనా. మన జీడీపీలో 61.4 శాతం వినియోగం రూపంలోనే సమకూరుతుండడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన రెండో ఏడాదిలో జీడీపీ వృద్ధి 0.5 శాతం మేర అదనంగా నమోవుతుందని ఆర్థిక వేత్తల అంచనా. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లు దేశ ఆర్థిక వృద్ధిని 0.20%-%0.50 శాతం ప్రభావితం చేస్తాయన్న ఆందోళనలు నెలకొనగా.. జీఎస్టీ సంస్కరణలతో ఈ ప్రభావం సమసిపోనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బ్రాండెడ్ బ్రెడ్, బ్రెడ్ ఉత్పత్తులపై 5%-%18 శాతం మేర జీఎస్టీ అమల్లో ఉండగా ఇది తొలగిపోనుంది. పరాటాపై 18 శాతం, చపాతీ, యూహెచ్‌టీ పాలపై 5 శాతం రేటును ఎత్తివేయనున్నారు. నిత్యావసరాలైన టూత్‌పేస్ట్, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, షాంపూలు, సబ్బులు, హెయిర్ ఆయిల్, బటర్, నెయ్యి, మాంసం, బిస్కెట్లతో పాటు షుగర్ కన్ఫెక్షనరీ, జామ్, ఫ్రూట్ జెల్లీలు, డ్రై నట్స్, ఐస్‌క్రీమ్, పండ్ల రసాలు, కార్న్‌ఫ్లేక్స్ తదితర ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గిపోనుంది. ఇక వంటింటి వస్తువులు, గొడుగులు, సైకిళ్లు, వెదురు ఫర్నీచర్ వస్తువులు, ఫీడింగ్ బాటిళ్లు, టూత్ పౌడర్‌పై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి దిగిరానుంది. ఇంటి నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్‌పైనా పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. 350 సీసీ ఇంజన్ సామర్థ్యం వరకు ఉన్న ద్విచక్ర మోటారు వాహనాలు, ఏసీలు, డిష్‌వాషర్లు, టీవీలు (32 అంగుళాలకు పైన) తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులపైనా ధరల భారం 28 శాతం నుంచి 18 శాతానికి దిగిరానుంది. ప1,200 సీసీ, 4,000 ఎంఎం పొడవు మించని పెట్రోల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ వాహనాలు, 1,500 సీసీ వరకు ఉన్న డీజిల్ వాహనాలపైనా పన్ను రేటు 18 శాతానికి తగ్గనుంది. 1,200 సీసీ నుంచి 4,000 ఎంఎం కంటే పొడవైన మోటారు వాహనాలు, 350సీసీకి పైన ద్విచక్ర వాహనాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు (వ్యక్తిగత వినియోగానికి), రేసింగ్‌కార్లు, క్యాసినోలు/గ్యాంబ్లింగ్/గుర్రపు పందేలు/లాటరీలపై 40 శాతం పన్ను రేటు అమలవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలపై ఎప్పటి మాదిరే 5 శాతం పన్ను కొనసాగనుంది.

# హరీశ్, సంతోష్ మేక వన్నె పులులు..



తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించలేదు. మీ చెల్లి, మహిళా ఎమ్మెల్సీని అయిన నాపై కుట్రలు జరుగుతున్నాయంటే 'బేటా ఏమైంది?' అని నాకు ఫోన్ చేయరా? కేసీఆర్ నుంచి నేను స్పందన కోరుకోలేదు, కానీ మీరు స్పందించాలి కదా. రామన్నా.. నా మీద ఎవరేం చెప్పారో తెలియదు. నా ప్రాణం పోయినా కేసీఆర్, కేటీఆర్‌కు హాని జరగాలని కోరుకునే ఆడపిల్లను కాదు. ఎన్ని జన్మల పుణ్యముంటే కేసీఆర్ లాంటి తండ్రి నాకు దొరికాడు. కానీ పార్టీకి ద్రోహం చేస్తున్న వారిని ఎందుకు క్షమిస్తున్నారన్నదే నా ఆవేదన. హరీశ్‌రావు, సంతోష్‌ల అవినీతి వల్లే మా నాన్న కేసీఆర్‌పై సీబీఐ విచారణ వచ్చింది. హైదరాబాద్- ఢిల్లీ విమాన ప్రయాణంలో సీఎం రేవంత్‌ను హరీశ్ కలిసి కాళ్లు పట్టుకున్న నాటి నుంచి మా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు మొదలయ్యాయి. హరీశ్‌రావుకు సంబంధించిన పాల వ్యాపారం, రంగనాయక సాగర్ వద్ద భూ ఆక్రమణలు, మాజీ ఎంపీ సంతోష్‌పై మద్యం షాపుల కేసు తదితరాలన్నీ రేవంత్‌తో ఉన్న అవగాహన వల్లే తెరమరుగయ్యాయి. హరిత హారానికి నకిలీ కార్యక్రమం గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరిట సినీ నటులను మోసపూరితంగా రప్పించి అటవీ భూములను కొల్లగొట్టేందుకు సంతోష్ ప్రయత్నించాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సంతోష్ అనుచరుడు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మోకిలలో రూ.750 కోట్ల బ్లూఫిన్ విల్లా ప్రాజెక్టు చేస్తున్నారు. సంతోష్‌ను మరో ఎమ్మెల్సీ నవీన్‌రావు తన గురువుగా చెప్పుకుంటున్నాడు. ఏసీబీకి వీరి అడ్రస్‌లు దొరకడం లేదా? రేవంత్ ప్రభుత్వంపై బరిగీసి కొట్లాడుతున్నందుకే మా కుటుంబంపై కుట్రలు జరుగుతున్నాయి. శ్రవణ్‌రావుతో కలిసి హరీశ్‌రావు, సంతోష్.. నా సిబ్బందితో పాటు కేటీఆర్, కేసీఆర్ ఫోన్లను కూడా ట్యాప్ చేయించారు. హరీశ్, సంతోష్ మీతో బాగున్నట్లు నటించవచ్చు. కానీ వాళ్లు మన కుటుంబం, తెలంగాణ మంచి కోరుకునే వారు కాదు. వాళ్లను పక్కన పెట్టి కార్యకర్తలను అక్కున చేర్చుకుని ప్రజల్లోకి వెళ్తేనే పార్టీ బతికి బట్ట కడుతుంది. హరీశ్ టీఆర్ఎస్ ఆరంభం నుంచి లేరు. టీడీపీ నుంచి కేసీఆర్ రాజీనామా చేసి బయటకు వస్తున్న సమయంలో రూ.కోటిన్నరతో వ్యాపారం చేసుకునేందుకు వెళ్లారు. 10 నెలల తర్వాత తిరిగి వచ్చిన హరీశ్‌ను క్షమించిన కేసీఆర్.. ఆయన ఎమ్మెల్యే కాకమునుపే మంత్రి పదవి ఇచ్చారు. హరీశ్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. ఆయనే ట్రబుల్స్ సృష్టించి వాటిని పరిష్కరించినట్లు చెప్పుకుంటారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావు 25 మంది ఎమ్మెల్యేలకు పార్టీ నిధితో పాటు అదనపు నిధులు కూడా ఇచ్చారు. కాళేశ్వరం అవినీతిలో సంపాదించిన సొమ్ముతో తన మనుషులు కొందరు ఎమ్మెల్యేలుగా ఉండాలనుకున్నారు. 2009లో కేటీఆర్‌ను ఓడించేందుకు హరీశ్ రూ.60 లక్షలు పంపారు. కేసీఆర్‌ను కూడా గజ్వేల్‌లో ఓడించాలని చూశారు. నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఎమ్మెల్యేలను ప్రభావితం చేసి నన్ను ఓడించారు. ఇలాంటి వారిని పక్కన పెట్టుకుని నన్ను బయటకు పంపితే పార్టీ బాగు పడుతుందా? ఈ రోజు నన్ను గాయపరిచిన ఆరడుగుల బుల్లెట్..రేపు కేసీఆర్, కేటీఆర్‌లో ఎవరిని గాయపరుస్తుందో? రామన్నా జాగ్రత్తగా ఉండండి. హంపిలో భేటీ అయిన కొందరు నేతలు అవమానకరంగా మాట్లాడి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైన సందర్భంలో కేటీఆర్ చేతులు పట్టుకుని హరీశ్ బ్రతిమిలాడారు. అక్కడ మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపారు. అందులో భాగంగానే ఈటల రాజేందర్ బయటకు వెళ్లారు. హరీశ్ వల్లే జగ్గారెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్‌రావు, విజయశాంతి, విజయ రామారావు తదితరులు పార్టీ నుంచి బయటకు వెళ్లారు. దుబ్బాక, హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో హరీశ్ వల్లే బీఆర్ఎస్ ఓటమి పాలైంది. పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత? అని చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు. కంప్యూటర్‌లో బీఆర్ఎస్ హార్డ్‌వేర్ అయితే తెలంగాణ జాగృతి సాఫ్ట్‌వేర్. తెలంగాణ జాగృతి ద్వారా పార్టీ అభి వృద్ధిలో నా కంట్రిబ్యూషన్ ఉంది. కేసీఆర్‌పై కొందరు ఒత్తిడి తెచ్చి నన్ను సస్పెండ్ చేయిం చారని నమ్ముతున్నా. కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తా. అయితే నా లేఖను లీక్‌ను లీక్ చేసిన వారిపై వంద రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నారనే సమా చారాన్ని కూడా లీక్ చేసే వ్యవస్థ అక్కడ ఉంది. నా కుటుంబంలో జరిగిన అనేక అంశాలు బయటకు చెప్పలేను. రాజకీయ అంశాలు మాత్రమే మాట్లాడుతున్నా. నిజానికి నా లేఖ లీక్ కా నంత వరకు నేను మాట్లాడలేదు. భవిష్యత్తులో అవసరమైన మరిన్ని విషయాలు బయట పెడ తా. హరీశ్ , సంతోష్ మేక వన్నె పులులు. వాళ్లను పార్టీలో కొనసాగిస్తే నష్టం జరుగుతుంది.

# బుద్ధి ఉన్నోడెవరైనా వారి వెనకాల ఉంటారా?



బతకనీయమన్నా రు. ఆనాడు అక్రమ కేసులు పెట్టి ఎంతోమందిని జైళ్లకు పంపించిన్రు%ొ%వాళ్లే ఇవాళ తన్నుకొని ఛస్తున్నారు. కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకుంటున్నారు. ఎవరూ అక్కర లేకుండగానే వాళ్ల కు వాళ్లే పొడుచుకుంటున్నారు' అని ఎద్దేవా చేశా రు. అవినీతి సొమ్ము వచ్చిన తర్వాత ఆ సొమ్ము ల పంపకాల్లో తేడాలొచ్చి వారికి వారే కొట్లాడుకుంటున్నారని, వారికి వారే యాసిడ్ దాడులు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఒకరు నవ్వుతూనే కడుపులో కత్తులు పెట్టుకొని నటించే పరిస్థితులు ఆ పార్టీలో దాపురించాయని, పాపం ఊరికే పోదని పెద్దలు చెప్పింద్రని, చేసుకున్న వాడికి చేసుకున్నంత మహానుభావా అని.. ఆ పాపాలు ఎక్కడికీ పోవని, కచ్చితంగా వెంటాడుతూనే ఉంటాయ,ని వారు అనుభవించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన వెనుకాల ఈయన ఉన్నాడని, ఈయన వెనుకాల ఆయన ఉన్నాడని తనను అంటున్నారని, 'అసలు చెత్తగాళ్ల వెనుక నెనెందుకుంటాను, నేను నాయకుడిని.. ఉంటే ప్రజల వెంట ఉంటా, మా వారికి ముందు ఉంటూ తోడుగుంటాను. వారికి వారే కత్తులతో పొడుచుకొని హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్ ఉన్నాడని ఒకరంటే లేదు ..లేదు.. కవిత వెనుక రేవంత్ ఉన్నాడని మరొకడు అంటున్నారు. వారందరూ దిక్కుమాలినోళ్లని తెలంగాణ ప్రజలు ఉతికి బండకేసి కొట్టారు. మీ వెనకాల ఎవరైనా బుద్ధి ఉన్నోడు ఉంటాడా? అన్నం తినేవాడు ఉంటాడా? నేను ఉండేది నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల వెంట ఉంటాను. ఇంత పనికిమాలిన వాళ్ల వెంట ఎందుకుంటానని స్పష్టం చేశారు.

'రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు తెలుసు.. దయచేసి మీ కుటుంబ పంచాయితీల్లోకో, మీ కులం పంచాయితిల్లోకి నన్ను లాగకండి' అని అన్నారు. 'జనం మిమ్మల్ని ఎప్పుడో తిరస్కరించారని, మీరు కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు' అని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ కాలగర్భంలోకి కలిసిపోతుందని జోస్యం చెప్పారు. ఒకప్పుడు మంచి పేరున్న జనతా పార్టీ కనుమరుగైందని అన్నారు. తెలుగుదేశం పార్టీ చాలా మంచి పార్టీ.. అనేక మందికి అవకాశాలు కల్పించిన పార్టీ ఆ పార్టీని కూడా కొంతమంది కుట్రల వలన తెలంగాణలో ఆ పార్టీ సమస్యను ఎదుర్కొంటున్నదని అన్నారు. ఎన్నో పాపాలు చేసిన బిఆర్ఎస్ ఎలా మనుగడ సాగిస్తుందని అన్నారు. ప్రకృతి అనేది ఉంటుందని అ ప్రకృతే శిక్షిస్తుందని వ్యాఖ్యానించారు.

### మొదటి ముద్ద పాలమూరుకే

'పాలమూరు జిల్లా నుంచి మొదటిసారిగా బూర్గుల రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి అయితే 75 ఏళ్ల తర్వాత మళ్లీ పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డికి అవకాశం వచ్చింది. ఇప్పుడు పాలమూరును అభివృద్ధి చేసుకోక పోతే ఇక ఎప్పటికీ అభివృది చెందదు. ఏ పరిశ్రమ వచ్చినా మొదట పాలమూరుకే పంపిస్తాను. కుర్చీలో కూర్చున్నది మీ వాడు.. మీ పాలమూరు వాడు.. ఎప్పుడూ మొదటిముద్ద మొదట పాలమూరుకే పెడతా.. అది నైతిక ధర్మం బాధ్యత' అని అన్నారు. 'అది చిన్నదా, పెద్దదా కా దు, ఏదైనా పాలమూరుకు మంజూరు చేస్తాను. ఎవరు ఏమనుకున్నా ముందు పాలమూరుకు ప్రా ధాన్యత ఇస్తా' అని స్పష్టం చేశారు. పాలమూరు జిల్లా అభివృద్ధి చూసి ఇతర ప్రాంతాలు అసూయపడాలి. పెద్ద పెద్ద పరిశ్రమలు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, బెంగుళూరును డిఫెన్స్ కనెక్టింగ్ క్యారిడార్‌గా మారుస్తా..డ్రైపోర్ట్‌ను తెచ్చుకుందాం, బ్రహ్మోస్ మిస్సైల్ క్షిపణి పరిశ్రమను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే మనకు మనమే మరణశాసనం రాసుకున్నట్లని అన్నారు.

### ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కే మొదటి ప్రాధాన్యత

రాష్ట్రంలో విద్య, సాగునీటి ప్రాజెక్టులకే తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పండింట్ నెహ్రూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రాజెక్టులు, యూనివర్సిటీల నిర్మాణం జరిగిందని, తాను కూడా అదే ఆయన స్ఫూర్తితో విద్య, సాగునీటికి ప్రాధాన్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్య ద్వారా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరిగితే సాగునీటి ప్రాజె క్టుల ద్వారా రైతుల అభివృద్ధితో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత పాలకులు పాలమూరు జిల్లాను కేవలం కరువు, వలసలు చూపించేందుకు ఇతర ప్రపంచ దేశాల అధినేతలను తీసుకొచ్చేవారు తప్పితే జిల్లాను ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో ఒక ఎంపిని పార్లమెంట్‌కు ఎంపిగా పంపితే తెలంగాణ సాధించిన తర్వాత పాలమూరులో ప్రాజెక్టులను పడావు పెట్టారని మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పాలమూరు బిడ్డగా తాను సిఎం అయిన తర్వాత పాలమూరు ప్రాజక్టులకు నిధులు కేటాయింపులు చేసి పాలమూరు రంగారెడ్డితో పాటు కల్వకుర్తి, కోయిలసాగర్, భీమా, నెట్టెం పాడు పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. నారాయణపేట=కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొస్తే కొందరు పర్యావరణ కోర్టులో కేసులు వేయించి పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల కోసమో, పరిశ్రమల కోసమో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారాన్ని సాధ్యమైనంత వరకు పెంచి ఇవ్వాలని స్పష్టం చేశారు. రైతుల దగ్గరికే కలెక్టర్లు వెళ్లి భూమి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పరిశ్రమలు వస్తే జిల్లా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు యూనివర్సిటీకి మంచి గుర్తింపుతో పాటు లా, ఇంజనీరింగ్, ట్రిబుల్ ఐటి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. రూ.220 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలను నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఐఐటిలకు అనుసందానంగా ఎసిటి ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా శిక్షణ పొందిన వారికి దేశంతో పాటు విదేశాల్లో కూడా మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిట శ్రీహరి, ఎంపి మల్లు రవి, ఎంఎల్ఎలు జి. మధుసూదన్ రెడ్డి, యన్నం శ్రీనివాస్ రెడ్డి, ఫర్నిక రెడ్డి, అనురుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రి బోయి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో టీచర్లూ భోజనం!

## ఫుడ్ పాయిజన్ సమస్యకు ఇదే పరిష్కారం: హైకోర్టు

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు అక్కడే భోజనం చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఫుడ్ పాయిజన్ (కలుషితాహారం) ఘటనల సమస్యను ఇది పరిష్కరిస్తుందని అభిప్రాయపడింది. నాణ్యతపై వారు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించింది. ప్రతీ స్కూల్ విద్యార్థికి ఎంత మొత్తంలో ఆహారం ఇస్తారు? ఏమేమి ఇస్తారు? ఎలా అందిస్తారు? న్యూట్రిషన్ ఎలా లెక్కిస్తారు?.. ఇలా పూర్తి వివరాలతో స్థాయి నివేదికను అందజేయాలని ఆదేశించింది. శ్రమను గౌరవించే గుణం అలవడాలంటే ముందు కష్టం తెలియాలని.. విద్యార్థులు పాఠశాల పనుల్లో భాగస్వామ్యమైతే తప్పేంటని ప్రశ్నించింది. చిన్నతనం నుంచే వారికి తమ పనులు తాము చేసుకోవడం అలవాటు చేయాలని సూచించింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ కేసులకు సంబంధించిన వివరాలు సమర్పించేలా సర్కార్‌ను ఆదేశించాలని కోరారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం తాజాగా బుధవారం విచారణ చేపట్టింది.

### ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు..

పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినించారు. 'రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. చట్టప్రకారం స్వచ్ఛమైన పౌష్టికాహారం అందించాలి. కానీ ప్రభుత్వం సరిగా అమలు చేయని కారణంగా విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇదే హైకోర్టు మార్గదర్శకాలు జారీ చేసినా, ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసినా.. ఆహార కల్తీ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రిన్సిపాల్ లేదా వార్డెన్.. రోజూ కిచెన్, స్టోర్ రూమ్ తనిఖీలు చేయాలి. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలి. ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించేందుకు అనుమతించాలి. కానీ ఇది జరగడం లేదు..'అని చెప్పారు.

### బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం..

అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 'ఫుడ్ పాయిజన్ కారణంగా ఎవరూ చనిపోలేదు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రిలో చేర్చగా, మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యారు. ఇలాంటి ఘటనల్లో బాధ్యులైన, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షలకు పైగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భోజనం, టిఫిన్ అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మధ్యాహ్న భోజన నిర్వహణపై కమిటీని ఏర్పాటు చేశాం. ఇందులో కేంద్ర ప్రభుత్వం తరఫున కూడా ఓ సభ్యుడు ఉన్నారు..'అని నివేదించారు.

### వ్యక్తిగతంగా ఎవరి పనైనా చేస్తేనే తప్పు

సీజే జోక్యం చేసుకుని.. రోజూ పిల్లలతో టీచర్ కూడా కలిసి అక్కడే భోజనం చేసే ప్రక్రియ చేపడితే ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉండదని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థులు పని చేయడం తప్పుకాదని, వ్యక్తిగతంగా ఎవరి పనులైనా చేస్తే మాత్రమే తప్పుబట్టాలన్నారు. తాను కూడా చిన్నప్పుడు పాఠశాలలో పనులు చేశానని గుర్తు చేసుకున్నారు.

# కలిసికట్టుగా సాగుదాం

కాంగ్రెస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్ రావు తన అనుచరులతో కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసినా సింగరేణి ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడంపై లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో భద్రాచలం, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాను పర్యటిస్తున్నట్లు వెల్లడించారు.

# 6న గణేశ్ నిమజ్జనానికి అమిత్ షా

హైదరాబాద్: ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) నిర్వాహకులు పంపించిన ఆహ్వానంపై అమిత్ షా కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం సానుకూల స్పందన వచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దీని ప్రకారం అమిత్ షా శనివారం ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఆయన బసచేస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్యలో రాష్ట్ర బీజేపీ నేతలతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆ తర్వాత 3 గంటల నుంచి 4 గంటల వరకు బీజీయూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ పర్యటనలో భాగంగానే.. ఐటీసీ కాకతీయ హోటల్ నుంచే ఎస్ఎస్‌బీ బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌కు అమిత్ షా వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 4:10 నుంచి 4:55 వరకు మొజంజాహీ మార్కెట్ వద్ద గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5:05 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి అమిత్ షా తిరుగు ప్రయాణమవుతారు.

## రాయికల్ లో ఉచిత పెయిన్ మేనేజ్మెంట్ శిబిరం




రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3 : శ్రీ హనుమాన్ దీక్ష పీఠం( వాల్గొండ) ఫౌండర్ డాక్టర్ ఆచార్య శశికాంత్ శర్మ, హెల్త్ టీం వారి ఆధ్వర్యంలో ఉచిత పెయిన్ మేనేజ్మెంట్ క్యాంప్, జగిత్యాల జిల్లా రాయికల్ పద్మశాలి సంఘం వారి సహకారంతో మన రాయికల్లోని మార్కండేయ మందిరంలో సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించుకుంటున్నాము. నడుం నొప్పి, మెడ నొప్పి ఒకపక్క కాలు లాగడం ఒకపక్క చేయి లాగడం మోకాళ్ళ నొప్పులు భుజం నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్న వారు, ఆ విధంగానే మహిళల సమస్యలకు ట్రీట్మెంట్ మరియు అవేర్నెస్ ఇవ్వడానికి భువనేశ్వరి మేడం పి ఆర్ ఆర్ టీ(యూఎస్ఏ) ( హైదరాబాద్), టీం వస్తున్నారు, ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు, ఉచిత క్యాంపుకు జాయిన్ కావాలనుకునేవారు 6 తేదీ లోపు 9949875037 నెంబర్కు మీ యొక్క పేరు మీయొక్క సమస్య వాట్సప్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని శ్రీ హనుమాన్ దీక్ష పీఠం ఫౌండర్ డాక్టర్ ఆచార్య శశికాంత్ శర్మ ఒక ప్రకటన లో తెలిపారు.




## కుమ్మరిపల్లి పాఠశాలలో అమ్మ పేరు మీద మొక్క నాటడం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపెల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమ%శీ%లో జిల్లా అటవీ శాఖ అధికారి జగిత్యాల పాల్గొని మొక్కలు నాటారు. తర్వాత పర్యావరణాన్నీ పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను, తల్లి పేరిట మొక్క నాటే కార్యక్రమం యొక్క విశిష్టతను తెలియపరిచారు. తర్వాత పాఠశాల పిల్లలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను చూసి వారికి నిర్వహించబడిన వ్యాసరచన, ఇతర సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విజేతలకు బహుమతుల్ని పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో డీఎఫ్ఓ జగిత్యాల , ఎఫ్ఆర్ఓ భూమేష్, ఎంఈఓ రాఘవులు, కుమ్మర్ పల్లి స్కూల్ హెచ్ఎం, స్కూల్ కమిటీ చైర్మన్ మానస మరియు కుమ్మర్ పల్లి ప్రజాప్రతినిధులు చింతలపల్లి స్వప్న, దొంతి నాగరాజు, బొంగు రాజు, సెక్షన్ ఆఫీసర్ మల్లన్న, బీటాధికారులు రమణారెడ్డి, విజయ, పాష, చంద్రశేఖర్, కవిత, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు, వాచర్ మల్లయ్య పాల్గొన్నారు.





## తాజ్ పూర్ గ్రామంలో మృతుల కుటుంబాలకు ఆర్ ఎస్ కె ఫౌండేషన్ ఆర్థిక చేయూత.

### ఆధైర్య పడవద్దు అండగా ఉంటా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తన అనుచరులతో గ్రామంలో ఇటీవల మృతి చెందిన వరిగంటి ఈశ్వరయ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000/వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదే గ్రామంలో పల్లెపాటి రవి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆధైర్య పడవద్దు అండగా ఉంటానని హామీ ఇచ్చి 5000/వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ కె ఫౌండేషన్ సభ్యులు, తాజ్ పూర్ గ్రామ ప్రజలు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు



## దెబ్బతిన్న మూటపెల్లి -కొత్త పేట బ్రిడ్జి వెంటనే మరమ్మతు చేయాలి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మూటపెల్లి - కొత్త పేట గ్రామ మధ్యలో ఉన్న బ్రిడ్జి గత కొన్ని రోజులు క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిని కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోగా స్థానిక నాయకులతో కలిసి బ్రిడ్జి నీ సందర్శించినా జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల రాయికల్ నిర్మల్ జిల్లా వరకు ఈ బ్రిడ్జి కనెక్టివిటీ ఉందని, ఈ బ్రిడ్జిని వెంటనే తాత్కాలిక మరమ్మత్తులు చేసి రాకపోకలకు ఇబ్బంది కాకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే దీనికి శాశ్వత పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.యస్ పార్టీ మండల అధ్యక్షులు బర్కం మల్లేష్, కో -ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి ,మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ మందుల శ్రీను, నాయకులు ప్రశాంత్ రావు, కంటే గంగారాం, అలుపట్ల లక్ష్మణ్, సుతారి తిరుపతి,గంగారెడ్డి , డా? ప్రవీణ్, చిన్నా, అరె బుచ్చన్న, రాజేశ్వర్ రెడ్డి ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపురం మండల రైతాంగానికి సాగునీరు అందించాలి.

### నాగం వర్షిత్ రెడ్డి.



సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్0 3 ( వార్త మిర్రర్): నారాయణపురం

బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు నారాయణపురం మండల శాఖ అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో నారాయణపురం మండలం స్థానిక సమస్యల మీద నిరసన ర్యాలీ తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ. నారాయణపురం మండలం హైదరాబాద్ కూతవేటు దూరంలో ఉన్న ఇటు కృష్ణానది అటు మూసినదికి మధ్యలో ఉన్న ఈ మండలంలోని గ్రామాలు ఎడారులను తలపిస్తున్నాయని ఇక్కడ రైతులు సాగునీరు లేక హైదరాబాద్ వలస వెళ్లి కూలీ పనులు చేసుకునే దౌర్భాగ్య పరిస్థితి ఇక్కడ రైతన్నలకు ఉందని ఆ సమస్యను తీర్చడం కోసం నారాయణపురం మండలానికి శివన్నగూడెం ప్రాజెక్టు నుండి ఎత్తిపోతల ద్వారా రాచకొండ గుట్టల్లో రిజర్వాయర్ ను ఏర్పాటు చేసి అక్కడ నుండి గొలుసుకట్టు చెరువుల ద్వారా నారాయణపురం మండలంలో వివిధ గ్రామాలకు సాగునీరు అందించడం ద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందని అన్నారు. నారాయణపురం మండల కేంద్రం నుండి జనగాం, గట్టుప్పల్, చండూర్ వరకు గుడిమల్కాపురం నుండి సర్వేలు, గుజ్జ, మునుగోడు వరకు ఉన్న రోడ్లను విస్తరించాలని వాటితో పాటుగా వివిధ గ్రామాల్లో లింకు రోడ్ల నిర్మాణానికి వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లాకు పేరుకు ఇద్దరు మంత్రులు ఉన్న ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అన్నారు. కళ్యాణ లక్ష్మి లో భాగంగా లక్ష రూపాయల తో పాటు తులం బంగారం అందించాలని అన్నారు. ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడు ఉద్యమిస్తూనే ఉంటుందని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శి జక్కలి రాజు యాదవ్, వంగరి రఘు, తంగేళ్ల సత్తయ్య, జక్కర్తి బిక్షం, నందగిరి జగత్ కుమార్, ఆత్కూరి రాములు, బండమీది కిరణ్, చిలువేరు వెంకటేష్,గొల్లూరి యాదగిరి సాగర్, సంపతి సుధాకర్ రెడ్డి, కట్కూరి లక్ష్మీ వెంకటేష్ గౌడ్, వెలజాల శ్రీను, సికిలమెట్ల వెంకటేష్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైదేహి నగర్ నార్త్ కాలనీ రోడ్డు 12 పార్కు లో ఓపెన్ జిమ్ ఏర్పాటు

**ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులకు ధన్యవాదాలు తెలిపిన అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు**



ఎల్బీనగర్, 3 సెప్టెంబర్:బి.ఎన్.రెడ్డి డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్ 12 పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు అయినట్లు కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కోవుల రాంబాబు తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సహాయ సహకారాలతో తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసి నిధులతో జోనల్ కమిషనర్ ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటుకు కావాల్సిన నిధులను జూన్ 6 వ తేదీ 2025 సంవత్సరం మంజూరు చేశారని వివరించారు. బుధవారం దానికి సంబంధించిన కాంట్రాక్టర్ వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో వారి సూపర్వైజర్ విజయ్ కుమార్ ని పంపించి ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేసే స్థలంలో వారు మెజర్మెంట్స్ వేసి ముగ్గు పోశారని గుర్తు చేశారు. హద్దు రాళ్లను వారి సిబ్బందితో వారి వాహనం ద్వారా పెట్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించేటట్లు సహాయ సహకారాలు అందించిన, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి, తెలంగాణ ప్రభుత్వానికి, జోనల్ కమిషనర్ కి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగానికి, హార్టికల్చర్ విభాగానికి, మరియు కాంట్రాక్టర్కి, కటిక రెడ్డి అరవింద్ రెడ్డి కి వారి అసోసియేషన్ తరపున కాలనీ వాసుల తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైదేహి నగర్ నార్త్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు, కార్యదర్శి రాజేందర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు నాగరాజా, వేణుగోపాల్, చక్రధర్, వెంకటేష్ గౌడ్, ఈమని కృష్ణ, పిడివి ప్రసాద్, కోటేశ్వరయ్య, కాలనీ వాసులు నాగేశ్వరరావు, శ్రీహరి వెంకట్రామిరెడ్డి, ప్రసాదు, రాజన్ మరియు పార్క్ వ్యూ అపార్ట్మెంట్ లోని కాలనీ సభ్యులు శంకు రాజేష్, సందీప్ సాహూ, శ్వేతా మెహర్ నాగ్, పరిమి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ జెమ్ మోటార్స్ పక్కన, గెలాక్సీ అపార్ట్మెంట్ దగ్గర 17.50 లక్షలు రూపాయలు అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, రాజా రాజేశ్వరి నగర్ సంతోష్ ధాబా వెనుక ఐదవ నెంబర్ వీధిలో, అవంతి అపార్ట్మెంట్స్ దగ్గర 19.50 లక్షలు రూపాయలు అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, రాజరాజేశ్వరి నగర్ ఓయూ కాలనీ మెయిన్ రోడ్డులో, అపోలో ఫార్మసీ దగ్గర 108 లక్షలు రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, గౌతమి ఎంక్లేవ్ దగ్గర, కొల్లా లగ్జారియా విల్లాస్ ఎదురుగా 105 లక్షలు రూపాయలు అంచనా వ్యయంతో బీటీ రోడ్లు వేయుటకు పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ , కార్పొరేటర్ హమీద్ పటేల్ , స్థానిక నాయకులు, కాలనీవాసులు, ప్రజలు, కార్యకర్తలు కలసి పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ , కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ...అన్ని విధాలుగా, కాలనీలను, బస్తీలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని, అదేవిధంగా ప్రతి చోటా కూడా మౌలిక వసతులు కల్పించుటకు తీవ్రంగా శ్రమిస్తున్నామని, ప్రజలు కోరుకునే విధంగా మౌనిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ , కార్పొరేటర్ హమీద్ పటేల్ తో పాటుగా సీనియర్ నాయకులు ఊట్ల కృష్ణ, ఊట్ల దశరథ్, కాకి నిర్మల, షేక్ చాంద్ పాషా, రాజేష్ యాదవ్, నీరుడి గణేష్ ముదిరాజ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, ఇర్ఫాన్ పటేల్, శ్రీనివాస్ చౌదరి, బుడుగు తిరుపతిరెడ్డి, బసవరాజు, కృష్ణమోహన్ రెడ్డి, గోపి, శ్రీకాంత్, వెంకటేష్, కాకి అవినాష్, అభి అక్షయ్, మహమ్మద్ జమీల్, రవిశంకర్, అనిల్ కుమార్, టి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## 7,11,116/- రూపాయలు పలికిన గణనాథుడి లడ్డు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : కొండాపూర్ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ బి బ్లాక్ లో థర్డ్ స్ట్రీట్ లో ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏకదంతా యూత్ కమిటీ సభ్యులచే నిర్వహించిన లడ్డు వేలం పాటలో 21 కిలోల గణేష్ లడ్డూ భీమ్ శెట్టి శివ ప్రణీత్ 7,11,116/- రూపాయలకు సొంతం చేసుకున్నాడు అలాగే 5 కిలోల లడ్డు జోషి శ్రీకాంత్ 3,11,116/- రూపాయలకు సొంతం చేసుకున్నారు . ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీ లోనే మొట్టమొదటిసారి గా నిర్వహించిన ఈ విఘ్నేశ్వరుని లడ్డు వేలం పాటలో కానీ విని ఎరుగని రీతిలో లడ్డు వేలం పాట జరగటం విశేషం అని అన్నారు. ఆ గణనాథుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు సుఖసంపదల్లో సంతోషంగా ఉండాలని ఆ గణనాథుని ప్రార్థించినట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు లడ్డు వేలంపాటలో గెలుచుకున్న భక్తులకు ఆ భగవంతుడు ఎప్పుడూ అండగా ఉంటూ అన్నిట్లో విజయం సాధిస్తూ ముందుకు రాణించాలని ప్రార్థించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## పాపిరెడ్డి కాలనీలో గణపతి పూజా కార్యక్రమంలో మారబోయిన రవి యాదవ్...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో బి.ఆర్. ఎస్ సీనియర్ నాయకులు సాయినందన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పాపిరెడ్డి కాలనీ లో కొలువుదీరిన గణపతి పూజా కార్యక్రమం కు బి ఆర్ఎస్ నాయకులు మారబోయిన రవి యాదవ్ పాల్గొన్నారు.సాయి నందన్ ముదిరాజ్ ఘనంగా పూలతో వారికి స్వాగతం పలికి శాలువా తో సత్కరించి స్వామి వారి సన్నిధిలో అర్చక బృందం చే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను అందజేశారు. ఈ సందర్భంగా రవి యాదవ్ మాట్లాడుతూ అందరికీ విఘ్నాలు తొలగించి ఆ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళల మీకు మీ కుటుంబ సభ్యులు తలపెట్టే కార్యాలలో విజయాలు సాధించాలని స్వామి వారిని కోరుకున్నాం అని తెలిపారు. అలాగే అద్భుతమైన స్వాగతం పలికిన సాయినందన్ ముదిరాజ్ మిత్ర బృందం కి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.



## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఏ. బ్లాక్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్

కొండాపూర్ వార్త మిర్రర్:శేరిలింగంపల్లి డివిజన్ శ్రీరామ్ నగర్ బి .బ్లాక్ నాలుగో గల్లీలో ఏ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినాయకుడి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ. ప్రసాద్ రావు. ఎల్లారెడ్డి. ఓబుల్ రెడ్డి. నాయుడు. నరసింహారెడ్డి. దయాకర్.చంద్ర మౌళి. శ్రీనివాస్. గణేష్ యాదవ్. విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## అల్లీపూర్ పటేల్స్ యూత్ వినాయకుని వద్ద అన్న ప్రసాద వితరణ పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3: జగిత్యాల జిల్లా రాయికల్ మండల%శీ% అల్లీపూర్ పటేల్స్ యూత్ ఎంబారి వాడ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణపతి మండపం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పటేల్ యూత్ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి, గణేష్ మండపం వద్ద వినాయకుణ్ణి దర్శించుకొని గణపతి పూజ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పటేల్ యూత్ సభ్యులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# బస్వాపురం ఉసిల్ల వాగుపైన హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలోని ఉసిల్ల వాగు పైనుండి ప్రయాణికులు రాకపోకలు కొనసాగించడానికి " హై లెవెల్ బ్రిడ్జిని "నిర్మాణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. బుధవారం సిపిఎం బస్వాపురం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఉసిల్ల వాగు పై హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలని కాల్వపైన ఉన్న చిన్న బ్రిడ్జి పైన నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ్మా పాల్గొని మాట్లాడుతూ బస్వాపురం గ్రామంతో పాటు ముత్తిరెడ్డిగూడెం, దాతర్ పల్లి గంగసానిపల్లి, జంగంపల్లి రాళ్లజనగాం గ్రామాలకు సంబంధించిన వందలాదిమంది ప్రజలు, వెహికల్స్ నిత్యము జిల్లా కేంద్రమైన భువనగిరితో పాటు వివిధ ప్రాంతాలకు ఈ రోడ్డు వెంటా ప్రయాణం కొనసాగిస్తున్నారని తెలిపారు. బస్వాపురం ప్రభుత్వ పాఠశాలకు గ్రామ విద్యార్థులతోపాటు హుస్నాబాద్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, ముంపు గ్రామమైన తిమ్మాపురానికి సంబంధించి అనేకమంది విద్యార్థులు కూడా ఆ రోడ్డులోని ఆవాగు దాటి స్కూలుకు వస్తారని తెలిపారు. వందలాది మంది విద్యార్థులు పై చదువుల కోసం, ఉపాధి కోసం అనేక మంది కార్మికులు, వృత్తిదారులు, పాల, కూరగాయల రైతులు నిత్యము భువనగిరి పట్టణానికి రాకపోకలు కొనసాగిస్తారని వీరందరూ కూడా చిన్నపాటి వర్షం పడిన, బస్వాపురం ప్రాజెక్టు నుండి ముత్తిరెడ్డిగూడెం, రాయగిరి చెరువులోకి కాల్వవ నుండి నీళ్లు వదిలన ఆ వాగు వంతన దాటే పరిస్థితి ఉండదని అన్నారు. వర్షాలు వచ్చినప్పుడు చుట్టూ 15, 20 కిలోమీటర్లు తిరిగి ప్రయాణం కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. వాగు వచ్చినప్పుడు దానిని దాటుచుండగా అనేక



మంది ప్రమాదాలకు గురవుతున్నారని, వాగు అవతల భాగంలో పంట పొలాలు ఉన్న రైతులు, పాడి రైతులు కూడ ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉసిల్ల వాగుపై హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, మండల కమిటీ సభ్యులు మద్యపురం బాల్ నరసింహ, శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్, నాయకులు నరాల చంద్రయ్య,యం.డి బాబు, చిక్కుల రాజు,నరాల కొమరయ్య, దుర్గపతి శ్రీను, చిక్క మహేష్, ఎలగల రాజయ్య తదితరులు పాల్గొన్నారు



## జిల్లెల్ల గ్రామంలో యథేచ్ఛగా సహజ సంపద దోపిడి

### - ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు.

కల్వకుర్తి సెప్టెంబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మండలం జిలేళ్ళ గ్రామంలో అక్రమ మైనింగ్ నిలిపివేయాలని కల్వకుర్తి ఆర్డిఓ,ఎమ్మార్వో కు, జిలేళ్ళ పంచాయతీ సెక్రటరీ కి జిలేళ్ళ గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. గత ఐదు సంవత్సరాలు నుండి చెన్నయ్య గుట్ట, జుగుట్ట పరిసర ప్రాంతంలో భారీ యంత్రాల సహాయంతో మరియు అక్రమ కరెంటు కనెక్షన్ తో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామపంచాయతీ రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారుల నుండి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. దీనివలన చుట్టుపక్కల పశువులు వ్యవసాయ పొలాలు రోడ్లు ధ్వంసం అవుతున్నాయని వారు తెలిపారు. వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని గుట్టల పరిరక్షణ తీసుకోవాల్సిందిగా పై అధికారుల కు వినతి పత్రం అందించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ముత్యాల నరేష్, కర్నాటి నరేష్, చిలుక రమేష్, కుమ్మరి సాయి, ఆంజనేయులు, నందు,చంటి, దేవేందర్,హరికృష్ణ, సాయి, తదితరులు ఉన్నారు.

# అవంతిపురం వినాయక మండపంలో అన్నదానం పాల్గొన్న తహసీల్దార్ సురేష్, సీఐ ప్రసాద్





మిర్యాలగూడ , సెప్టెంబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం కొండపై కొలువు దీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయకుని ఆలయంలో చత్రపతి శివాజీ యూత్ కమిటీ నిర్వహించిన 18వ వార్షికోత్సవ నవరాత్రి ఉత్సవాలు వేద పండితులు రాధాకృష్ణ అయ్యవారి పర్యవేక్షణలో బుధవారం తహసీల్దార్ ఎస్.సురేష్ కుమార్, రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, ఎస్ఐ ఎం.లక్ష్మయ్య, ఆర్ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గాయత్రి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం గుమ్మడెల్లి చిన్న సోమయ్య దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 600 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలిశెట్టి వీరయ్య, లింగంపల్లి రవి, నాగాటి సుధీర్ బాబు, లింగంపల్లి లక్ష్మణ్, గుమ్మడెల్లి భరత్, కుర్ర రామస్వామి, షేక్ రహీం, చిట్యాల సైదులు, గుజ్జ శీను, చదుర్ల సాగర్, కిషోర్, అరవింద్, అభిలాష్, మురళి, సాయిరాజు, అనిల్, కందాటి లక్ష్మయ్య, నరేష్, గ్రామ పెద్దలు చిమట పెద్ద మదర్, గుమ్మడెల్లి పెద్ద సోమయ్య, ఉప్పుతల్ల మహేష్, కుర్ర వెంకన్న, యాదమ్మ పాల్గొన్నారు.





## శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం.....

మాదాపూర్ వార్త మిర్రర్ మిర్రర్ : మాదాపూర్ డివిజన్ పరిదిలో లో నీ సైబర్ హిల్స్ రోడ్ నెంబర్ 09 లో శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మోసపూరిత హామీలివ్వడమే కాంగ్రెస్ నైజం

### - రోడ్డు నిర్మాణం కొరకై ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేత

### - బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ సెప్టెంబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండలంలోని బిజెపి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మాదారం నుండి ఊరుకొండ వరకు బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాదయాత్ర చేయడం జరిగింది. అదేవిధంగా మాదారం నుండి రాచాలపల్లి వరకు రోడ్డు నిర్మాణం కొరకై ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. ఈ పాదయాత్రకు మద్దతుగా మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక రోడ్డు వేయలేని దుస్థితికి దిగజారిపోయిందని అన్నారు. పేరుకు మాత్రమే ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వమని మోసపూరితమైన హామీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎక్కడి ఏసినా గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. వృద్ధాప్య పింఛను, రైతు బంధు, రుణమాఫీ, మహిళ 2500 , తులం బంగారు, సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన రేవంత్ సర్కార్ ను స్థానిక ఎన్నికల్లో ప్రజలు భూస్థాపితం చేస్తారన్నారు.

### రాష్ట్ర నాయకులు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ

ఆరు గ్యారెంటీల పేరుతో 66 మోసాలు చేసిందని అన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో రేవంత్ సర్కార్ కు అలవాటుగా మారిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్



పేరుతో ఆటలాడుతుందని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ప్రతి గ్రామానికి వైన్ షాపు పెట్టి గ్రామ ప్రజలను తాగుబోతులను చేయాలనేదే తన ముఖ్య ఉద్దేశమని,ఇప్పుడు మనం చేతగాని ప్రభుత్వాన్ని చూస్తున్నామని అన్నారు. నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ రాష్ట్రానికి యూరియా అందిస్తున్నారని ఈ కాంగ్రెస్ నాయకులు యూరియాని పక్కదారి పట్టించి రైతులకు చేరకుండా దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు అవుతున్న స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా గ్రామాలు అపరిశుభ్రంగా తయారయ్యావని చేతగాని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 11వరకు ప్రభుత్వ పాఠశాలల క్రీడలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 3

సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 11వరకు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 మరియు 17 బాల బాలికలకు కబడ్డీ , ఖో ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ నందు పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి రాఘవులు తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీన అండర్ 14 మరియు 17 బాలికలకు, కబడ్డీ ఖో వాలీబాల్, 10వ తేదీన అండర్ 14 మరియు 17 బాలురకు కబడ్డీ ఖో ఖో వాలీబాల్ పోటీలు,11వ తేదీన అండర్ 14 మరియు అండర్ 17బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 14 లో పాల్గొనే క్రీడాకారులు 1.1.2012 తరువాత జన్మించిన వారు, అండర్ 17 లో పాల్గొనే క్రీడాకారులు 1.1.2009 తర్వాత జన్మించిన వారు అర్హులు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్స్, డేట్ ఆఫ్ బర్త్ పత్రములతో ప్రధాన ఉపాధ్యాయుల సంతకం తో పాల్గొనవలెను. గమనిక. ఇందులో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా పాల్గొనవలెను. కబడ్డీ బరువు అండర్ 14 బాలికలు 48కిలోలు,బాలురకు 51కిలోలు లోపు ఉన్నవారు,అండర్ 17బాల బాలికలకు 55కిలోల బరువు లోపు ఉన్నవారు అర్హులు. పాల్గొనే క్రీడాకారులు సెప్టెంబర్ 6వ తేదీ లోపు ఎంట్రీ లు ఇవ్వగలరు. మిగతా వివరాలకు క్రిష్ణ ప్రసాద్ 9440037393 ని సంప్రదించగలరు.



## ప్రత్యేక ప్రజావాణి లో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్


మిర్యాలగూడ సెప్టెంబర్ 3:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ లో బుధవారం ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ ఇతర ఉన్నత అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను అందరిని ఒక్కదగ్గరకి తీసుకొని వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి ప్రజావాణిలో తీసుకోచ్చి ప్రజలందరూ అవకాశాన్ని సధ్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన 4ప్రత్యేక ప్రజావాణిలో 285 ఫిర్యాదులు రాగా 160 పరిష్కరించామని, మిగిలిన 125 సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు 20 రోజుల్లో పరిష్కరించాలని పెండింగ్ ఉండవద్దని ఆయన అన్నారు. ప్రజావాణిలో సుమారు 20 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో సబ్ కలెక్టరేట్ 4, తహసీల్దార్ మిర్యాలగూడ, త్రిపురారారం నాలుగేసి, దామరచర్ల 2, వేములపల్లి, మాడ్గులపల్లి ఒక్కొకటి, మిర్యాలగూడ ఎంపిడిఓ 1, డిఆర్డిఓ 1, నీటిపారుదల శాఖ ఇఇ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓలకు ఒకొక్కటి ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఎం.శేషగిరిశర్మ, డి.జితేందర్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్, మేనేజర్, రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, నీటిపారుదల శాఖ, మునిసిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి. అహ్మదుల్లా, బిక్షం, వెంకన్న, విద్యుత్ టూ టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ జి.రవీందర్ రెడ్డి, ఎఇ నవీన్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## నూతన రేషన్‌షాప్‌లో సన్న బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ సెప్టెంబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలో నూతన రేషన్ షాప్ ను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్దీ కాలంలోనే పేద ప్రజల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించి ప్రజా ప్రభుత్వంగా పేద ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డి. స్కై ల్యాబ్ నాయక్, నాగునాయక్, ఎన్. మట్టారెడ్డి, డి. రవితేజ, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

## మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు అంగన్వాడీ టీచర్లకు నూతన యూనిఫామ్



మిర్యాలగూడ, సెప్టెంబర్ 3:-( వార్త మిర్రర్) ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు లోని 211 అంగన్వాడీ టీచర్లకు నూతన యూనిఫామ్ దుస్తులు వచ్చాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా యూనిఫామ్ దుస్తులు కూడ మారుతున్నాయి. మొన్నటి వరకు మెరూన్ కలర్ మధ్యలో చుక్కలు డిజైన్ చీరెలు, బ్లౌజులు రాగా నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో చిలక పచ్చ, ఎరుపు చీరేలు వాటికి మాచింగ్ జాకెట్లు వచ్చాయి. కొన్ని రోజుల క్రితం దుస్తులు వచ్చాయి. అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో నిల్వ ఉన్నాయి. పంపిణికి నోచుకోలేదు. పంపిణి గురించి ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమతను అడగగా ఆమె మాట్లాడుతూ త్వరలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పంపిణి చేయాలని కోరామని సమయం ఇవ్వగానే పంపిణి చేస్తామని తెలిపారు.



## మృతుడి కుటుంబానికి భరోసా

### - జకినాలపల్లి మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ సెప్టెంబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ మండల ఠాగూర్ తండాకి చెందిన లక్ష్మణ్ భార్య రమావత్ జంకు అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న జకినాలపల్లి మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి తక్షణ సహాయం రూ" 5000 రూపాయలు కుటుంబానికి అందజేయడం జరిగింది. బాధిత కుటుంబానికి భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానీచ్చారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ హామీల ఆర్భాటం.. చేతలు శూన్యం

## - రేవంత్ రెడ్డికి పేదల ఉసురు తగులుతుంది -తల్లోజు ఆచారి



కల్వకుర్తి సెప్టెంబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలని వృద్ధులను, వితంతులను, వికలాంగులను,మహిళలను, నిలువునా మోసం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేదల ఉసురు తగులుతుందని తల్లోజు ఆచారి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణం ఎమ్మార్వో ఆఫీస్ ముందు కల్వకుర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు గన్నోజు బాబీదేవ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఒకరోజు నిరాహార దీక్ష చేశారు.నిరాహార దీక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తల్లోజు ఆచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత 6 గ్యారంటీల హామీలతో గద్దెనెక్కి ఇవాళ తెలంగాణ ప్రజలను హరిగోశలు పెడుతుంది మీరు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను హామీలను గద్దె దిగక ముందే గద్దె మీద ఎక్కిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మెడలు వంచి ఆరు గ్యారంటీలు అమలు పరిచేలా ఉద్యమిస్తానని అందులో భాగంగానే మొదటి దశలో ర్యాలీలు నిర్వహించామని రెండవ దశలో ఈరోజు కల్వకుర్తి తాలూకాలోని 160 గ్రామపంచాయతీలు రెండు మున్సిపాలిటీలలో బిజెపి కార్యకర్తలతో నిరాహార దీక్ష కార్యక్రమం చేస్తున్నామని మూడవ దశలో రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డి పల్లిని ముట్టడిస్తామని హెచ్చరించారుకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ నరసింహ, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బృంగి వివేకానంద, సీనియర్ నాయకులు నీరుకంటి రాఘవేందర్ గౌడ్,నరెడ్ల శేఖర్ రెడ్డి, పాలకూర్ల రవిగౌడ్,గుండోజు గంగాధర్, సంపతి అభిలాష్ రెడ్డి, ధన్నోజు నరేష్ చారి,పానుగంటి శివకుమార్, సంపతి శేఖర్ రెడ్డి,కాళిదాసు రాగిపాణి పట్టణ ఉపాధ్యక్షులు ఎరుకలి అభిగౌడ్, కొల్లూరు శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు,నాప శివ, పెద్దారి పర్వతాలు,కార్యదర్శి కిరణ్ కుమార్ యాదవ్,పట్టణ కోశాధికారి లక్ష్మీనరసింహ,వాకిటి శ్రీకాంత్,తోడేటి అరవింద్ రెడ్డి,సాయి,మాకం శ్రీనివాసులు, శ్రీకాంత్,అఖిల్ చారి,మహేష్, పలువురు వృద్ధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ యూఐ పోస్టల్ కార్డు కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ సెప్టెంబర్ 03 వార్త మిర్రర్:ఎన్ఎస్యూఐ తలపెట్టిన "ఓటు చోరీ హటావో %-% ప్రజాస్వామ్యం బచావో" పోస్టల్ కార్డు ఉద్యమంలో భాగంగా, దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్రపతి కి లేఖ రాయడం జరిగింది. ఈ కార్యక్రమం ఎన్ ఎస్ యూ ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ సహకారంతో ఓటు చోరీ విధానాలు అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు.ఒకే వ్యక్తికి అనేక చోట్ల ఓట్లు ఉండటం వంటి తీవ్రమైన లోపాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే నిరూపించినప్పటికీ, అధికార యంత్రాంగం దానిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకే వ్యక్తికి ఒకే ఓటు అనే రాజ్యాంగ సూత్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని, వెంటనే ఈ తప్పిదాలను సరిదిద్దాలని, ఓటు చోరీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్రపతి కి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు."ప్రజాస్వామ్యం బతికే ఉండాలంటే ఓటు హక్కు సురక్షితంగా ఉండాలి. ఓటు హక్కు ప్రధానమైన హక్కు. ఈ భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత" అని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, దేవరకొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు యూనుస్ మాజీ దేవరకొండ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు మాజీ కౌన్సిలర్ పొన్నబోయిన సైదులు కో ఆప్షన్ సభ్యులు సాదిక్ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రాంసింగ్ నాయక్, యువజన కాంగ్రెస్ దేవరకొండ టౌన్ వైస్ ప్రెసిడెంట్ పొట్ట ప్రభు, మోహన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ ఎస్ యూ ఐ యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనము ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

## దేవరకొండ ఆర్డిఓకు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో వినతిపత్రం



దేవరకొండ సెప్టెంబర్ 03 వార్త మిర్రర్ నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లోని అంబేద్కర్ భవనము నూతన భవనము శిథిలావస్థకు చేరుతున్న స్థలంలో బిల్డింగ్ లోపల పిచ్చి మొక్కలు విపరీతంగా లేచి భవనం నిరుపయోగంగా మారుతున్న ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పూర్తిగా పట్టించుకోక పోవడంతో ప్రభుత్వం ద్వారా నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ఓపెనింగ్ చేసి దళిత బహుజన ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డికి బుధవారం మెమొరం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దళిత డా. బుర్రి వెంకన్న పాల్గొని మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ భవనము నూతనంగా నిర్మాణం చేసిన అది పిచ్చి మొక్కలు మొలుస్తూ నిరుపయోగంగా ఉండడం దళిత బహుజన సంఘాలకు ఉపయోగంలోకి తీసుకురాకపోవడం ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యమా దళితుల పట్ల వివక్షన? అని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది, వెంటనే దళిత భోజన సామాజిక సమస్యల పరిష్కారానికి దళితులకు అంబేద్కర్ భవనాన్ని వెంటనే ప్రారంభించి దళితులకు అందించాలని లేకపోతే దళిత బహుజన సంఘాలు ఐక్యం చేసి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తానని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది, వెంటనే సముద్రిక అధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని భవనాన్ని ప్రజలకు ఏమైనా శుభకార్యాలకు ప్రజా సంఘాల మీటింగ్లకు వినియోగించుకునేలా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ అంబేద్కర్ భవనం ఉన్నా కూడా దాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి. విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి శేపూరి రాజేష్ కొండమల్లేపల్లి కన్వీనర్ మేదరి ప్రసాద్ చేపూరి లక్ష్మయ్య సభ్యులుఇరిగి రవి తదితర.సభ్యులు పాల్గొన్నారు.

# భువనగిరి మండలంలో పలు గణనాధుల మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఆర్ ఎస్ కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెలకొల్పిన గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఆర్ ఎస్ కె ఫౌండేషన్ అధినేత, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ బొమ్మలరామారం మండలం పకీర్ గూడెం గ్రామంలో జై శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు, బొమ్మలరామారం ఎస్సై శ్రీశైలం గార్లతో పాల్గొన్నారు, అనంతరం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక నిమజ్జన శోభయాత్రలో పాల్గొన్నారు, భువనగిరి మున్సిపాలిటీలో అరుంధతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేష్ మండపం వద్ద అన్నప్రసాద వికరణ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ కె ఫౌండేషన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, పలు గ్రామాల ప్రజలు, మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# లడ్డును కైవాసం చేసుకున్న సందపేట సురేష్ మరియు సందపేట రమేష్



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హాఫీజ్ పేట్ గ్రామం శ్రీ వినాయక ఉత్సవ కమిటీ ,కుమ్మర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వినాయకుని లడ్డూ వేలంపాటలో మొదటి లడ్డు రూ . 82,000/- లకు శ్రీ సందపేట సురేష్ లడ్డును కైవాసం చేసుకోగా రెొండవ లడ్డు ను రూ . 56,000/- లకు,శ్రీ సందపేట రమేష్ లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వారికి ,వారి కుటుంబసభ్యులకు ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు కలగాలి అని కోరుకుంటు, వారికి హాఫీజ్ పేట్ గ్రామం, కుమ్మర సంక్షేమ సంఘం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# చౌరస్తా యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అన్నదానం

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 3( వార్త మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని చౌరస్తా యువజన సమాఖ్య ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన గణేష్ మండపం దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని యూత్ సభ్యులు దాతల సహకారంతో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై జగన్ విచ్చేసి పూజా కార్యక్రమాలల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఈ నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటున్నారు.శోభాయాత్రను కూడా ప్రశాంతంగా జరుపుకొని దేవుని ఆశీస్సులు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# వివేకానంద యువ కేంద్ర వినాయక నిమజ్జన శోభా యాత్రని విజయవంతం చేద్దాం.

## వివేకానంద యువ కేంద్ర అధ్యక్షులు న్యాయవాది రాపర్తి వెంకటేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో వివేకానంద యువ కేంద్ర ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్రకు 04- 09- 2025 గురువారం నాడు వివేకానంద యువ కేంద్ర వ్యవస్థాపకులు, 1989 నుంచి వివేకానంద యువ కేంద్ర సభ్యులుగా నాయకులుగా, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులుగా నాయకులుగా ఉన్నటువంటి సభ్యులందరూ హాజరుకావాలని తెలిపారు.వివేకానంద యువ కేంద్ర అధ్యక్షులు రాపర్తి వెంకటేష్ గౌడ్, వివేకానంద స్ఫూర్తితో మనందరి సమిష్టి కృషితో 35 సంవత్సరాలుగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఇంతవరకు వచ్చామంటే అది మన విజయం గా భావించి, వ్యవస్థాపకుల నుంచి నేటి గణేష్ నవరాత్రుల మహోత్సవ నిర్వాహకులు వరకు నేటి నిమజ్జన శోభాయాత్రలో అందరం కలుసుకొని ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరిలో ఉందని తెలిపారు. దానికి అందరూ సహకరించి సమయానికి నిమజ్జన శోభాయాత్రకు నారాయణపూర్ చేరుకోవాలని తెలిపారు



# సంఘాల సభ్యులకు ఐదు బస్తాల యూరియా?

## మిగతా రైతులకు రెండు బస్తాలు ఇదెక్కడ న్యాయం

మిర్యాలగూడ, సెప్టెంబర్ 3:- (వార్త మిర్రర్) గంటల తరబడి క్యూలో ఉంటే దొరికేది ఎకరాకు బస్తా యూరియా అని వాపోతున్న రైతన్న. మిర్యాలగూడ పట్టణంలోని, మిర్యాలగూడ మండలంలోని ఆలగడప, తడకమళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులు యూరియా కోసం గంటల కొద్ది క్యూలో నిల్చుని ఉండాల్సి వస్తుంది. ఎకరాకు రెండు విడతలుగా ఒకొక్క బస్తా వరి పైరుపై చల్లాల్సి ఉంటుందని ఆయా సహకార సంఘాలకు 400 బస్తాల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. సంఘం సభ్యులకు 5బస్తాలు, సాధారణ రైతుకు 2 బస్తాలు ఇవ్వడం రైతుల్లో ఆందోళనకు దారి తీస్తుంది. సభ్యులు 5 బస్తాలు ఆటోలలో వేసుకుని పోతుంటే గంటలు క్యూలో ఉన్నవారికి యూరియా దక్కుతుందా అనే ఆందోళనలో ఉన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులోని మిర్యాలగూడ మండలంలోనే సుమారు 35,000ఎకరాలు వరి సాగవుతున్నది. మండలంలో ఉన్న 6 సంఘాలకు చాలి చాలని విధంగా యూరియా కేటాయిస్తుండటంతో చిన్న, సన్న కారు రైతులకే ఇబ్బందులేర్పడ్డాయి. బడా రైతులు సీజన్ రాక ముందే కాంప్లెక్స్ ఎరువులు, యూరియా కొని పెట్టుకున్నారు. చిన్న రైతులు వెనకబడ్డారు. దీంతో కాస్తా కొరత ఏర్పడింది. ఆయా సంఘాల వద్ద యూరియా విక్రయం జరుగుతుండటంతో భారీ క్యూ ఉండటంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, ఎస్ఐ అప్రీన్, ఏఎస్ఐ గొప్పమ్మలు, మండలంలో సీఐ పిఎన్డి ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్యలుఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# భక్తుల కోలాహలం మధ్య శ్రీ శ్రీనివాస కాలనీ విఘ్నేశ్వరుడి నిమజ్జన శోభ యాత్ర

## శోభ యాత్రలో స్వామికి ఘన స్వాగతం పలికిన కాలనీ మహిళలు





హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : హయత్ నగర్ హయత్ నగర్ డిపో రోడ్డు శ్రీ శ్రీనివాస కాలనీ లో నెలకొల్పిన గణనాథుని నిమజ్జన శోభాయాత్ర భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. గణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లడ్డు పాటను ముగించుకొని గణపతి స్వామిని నిమజ్జన వాహనం అలంకరించి శ్రీనివాస కాలనీ వీధిలగుండా ఆటపాటలతో మహిళలు, చిన్నారుల నృత్యాలతో యాత్ర ఘనంగా సాగింది, శుభయాత్రలో గణనాథుడికి మహిళలు ఘన స్వాగతం పలికారు నిమజ్జన శోభ యాత్ర పురవీధుల గుండా తిరుగుతూ గంగమ్మ ఒడికి గణనాథుని చేర్చారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస కాలనీ కమిటీ గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు, కమిటీ నాయకులు, కాలనీ ప్రజలు చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు